సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 28-2-2025

సంపుటి: 20 సంచిక: 286

పేజీలు: 8 వెల: రూ.1




## నాగావళిలో మృతదేహం

**- తోపుడు బండి వ్యాపారి రాముగా గుర్తింపు -**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నాగావళి పాత వంతెన కింద మృతదేహం ఉన్నట్టు శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో ఒకటో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నగరంలోని తోటపాలెం జంక్షన్ నీలమ్మకాలనీలో నివాసముంటున్న కొత్తూరు మండలం బత్తిలికి చెందిన యాదవరెడ్డి రాము(40)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు రాము స్థానికంగా తోపుడు బండిపై పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాము గత కొంతకాలంగా మతిస్థిమితం లేనట్లు వ్యవహరిస్తున్నాడని స్థానికులు తెలిపారు. గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో కోటేశ్వరస్వామి ఆలయ పరిసర ప్రాంతాల్లో తిరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ హరికృష్ణ సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చిన అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. వంతెన కింద మృతదేహం ఉందన్న సమాచారంతో పాత వంతెన వద్ద స్థానికులు గుమిగూడడంతో వంతెనపై వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ అయింది.

## రాజకీయం పులి మీద స్వారీ

### - అర్థమైందా కృష్ణమురళీ -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పోసాని కృష్ణమురళీ అరెస్ట్ ఊహించిందే. తను మటుగు తాను సినిమా డైలాగులు రాసుకొని అడపా దడపా సినిమాల్లో నటిస్తూ బతికితే ఇంత సమస్య ఉండేదికాదు. మధ్యలో రాజకీయాల్లోకి వచ్చారు. రాజకీయ రథచక్రాల కింద చిక్కుకొని విలవిలలాడుతున్నారు. రాజకీయాలు చేస్తున్నప్పుడు, ముఖ్యంగా ప్రత్యర్థులను విమర్శిస్తున్నప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలి. విమర్శలు విధానాల మీద చేయాలి. వ్యక్తుల్ని టార్గెట్ చేయకూడదు. కృష్ణమురళీ చేసిన పొరపాటు అదే. పవన్‌కల్యాణ్ మేనల్లుడు సాయిధరమ్ తేజ్ నటించిన రిపబ్లిక్ సినిమా వేడుకలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై అప్పట్లో పోసాని కృష్ణ మురళీ మాట్లాడిన తీరు ముక్కున వేలేసుకునేట్టు చేసింది. ఆ తర్వాత కూడా భార్య, తల్లి.. ఇలా ఇంట్లో మహిళలెవర్నీ వదలకుండా ఆయనొక ఫ్లోలో చేసిన ఆరోపణలే ఇప్పుడు ఆయన పీకల మీదకు తెచ్చింది. చంద్రబాబును, పవన్‌కల్యాణ్‌ను వ్యక్తిగతంగా విమర్శించారు. జగన్ ప్రభంజనంలో ఇవన్నీ కొట్టుకుపోతాయనుకున్నారు. ఆయన చేసిన విమర్శల వెనుక దాగివున్న నిజానిజాలు ఇక్కడ ప్రస్తావించనవసరం లేదు. రాచరికపు అంతరంగిక రహస్యాలు తెలుసుకోవడం సామాన్యుడికి మంచిదికాదు. వాటిని బయటపెట్టడం రాజ్యంలో ఉన్నవారికి అసలు మంచిదికాదు. ఆ విధంగా పోసాని వైకుంఠపాళీలో పాము పడగకు చిక్కారు. బయటపడే నిచ్చెన కనుచూపు మేర కనిపించడంలేదు. 2029లో జగన్ అధికారంలోకి వస్తేనే వీరందరికీ కాస్త ఊపిరి పీల్చుకునే టైముంటుంది. గతంలో ఇలానే కొంతమంది సినీనటులు ఎక్కువచేసి బలైపోయారు. 2019లో బాగా హడావుడి చేసిన శివాజీ 2020 తర్వాత విషయం అర్థమై మౌనంగా ఉన్నారు. 2024లో ఆయన రాజకీయాలు మాట్లాడలేదు. శివాజీకి జ్ఞానోదయమైంది. పవన్‌కల్యాణ్ ప్రతీ సినిమాలో ఉన్న ఆలీ పవన్‌ను విమర్శించి అవకాశాలు కోల్పోయాడు. ఇప్పుడు ఏ పార్టీలో లేను అని ప్రకటించినా అందరివాడు కాస్తా ఎవరికీ చెందనివాడైపోయాడు. థర్టీయియర్స్ ఇండస్ట్రీ పృధ్వీ జగన్ దయ వల్ల మంచి పదవే చేపట్టాడు. తన బలహీనతతో సీటుకు ఎసరు తెచ్చుకొని జగన్‌కు ఎదురుతిరిగాడు. నోటిదురదతో ఈమధ్య - మిగతా చివరి పేజీలో



- ❖ డీఐవో వాహనానికి వేరే పీవో బిల్లు
- ❖ కోవిడ్ బ్యాచ్‌కు ఉద్యోగాలిస్తామని వసూళ్లు
- ❖ ఫోకల్ సీట్లు కేటాయింపునకు రూ.25వేలు
- ❖ ఎన్నికల కోడ్ చూపించి అదనపు కలెక్షన్లు

## డీపీఎంవో ఆదేశిస్తారు..
## డీఎంహెచ్‌వో పాటిస్తారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**"నాకన్నా సీనియర్లు, అంతకు మించిన ముదుర్లు ఇక్కడ పని చేస్తున్నా నన్ను మాత్రమే ఏరికోరి జిల్లా మంత్రి డీపీఎంవోగా ఇక్కడ ఫారన్ డెప్యూటేషన్ సర్వీస్ మీద తీసుకొచ్చారంటే నా కెపాసిటీ ఏమిటో అర్థం చేసుకోండి. పత్రికల్లో వార్తలు వచ్చినంత మాత్రాన నన్నేం పీకలేరు. వైద్య ఆరోగ్యశాఖలో ఏం చేయాలన్నా నేనే చేయాలి. డీఎంహెచ్‌వోకు నేను పెట్టమన్న చోట సంతకం పెట్టడం తప్ప వేరే ఆప్షన్ లేదు."**

..ఇది ఎన్ఆర్‌హెచ్ డీపీఎంవోగా పని చేస్తున్న రవీంద్ర ఉవాచ.

క్షేత్రస్థాయిలో జరుగుతున్న అంశాలు పరిశీలిస్తే.. ఇది వాస్తవమేనని అర్థమవుతుంది. డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న అధికారి కేవలం డీపీఎంవో రవీంద్ర చెప్పిన ఫైళ్ల మీదే సంతకాలు చేస్తుండటం ఇందుకు మొదటి ఉదాహరణ అయితే, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉన్న మిగిలిన ప్రాజెక్టు ఆఫీసర్లందరూ డమ్మీలుగా మిగిలిపోవడం రెండవ ఎగ్జాంపుల్.

### కలెక్టరేట్ పేరు చెప్పి వసూళ్లు

జిల్లాలో వైద్యాధికారులుగా పని చేస్తున్న 19 మందికి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చదువుకోడానికి అవకాశం వచ్చింది. వీరిని ఇక్కడ ఉద్యోగాల నుంచి రిలీవ్ చేయడానికి అక్షరాలా రూ.30వేలు ఒక్కో వైద్యాధికారి నుంచి వసూలుచేశారు. ఈ విషయాన్ని గత శీర్షికలో ప్రస్తావించిన విషయం పాఠకులకు తెలుసు. అయితే ఈసారి కొత్తగా కలెక్టరేట్‌లో రూ. 5వేలు ఇస్తేగాని రిలీవ్ చేయరని ఫిటింగ్ పెట్టి అదనంగా మరో రూ.5వేలు వసూలుచేశారు. పీజీకి వెళ్తున్న వైద్యాధికారులకు ముందు రిలీవ్ చేయడానికి రూ.10వేలు డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఇవ్వాలని బేరంపెట్టారు. డీపీఎంవోకు డబ్బులిస్తే సూపరింటెండెంట్‌గా నేను గోళ్లు గిల్లుకుని కూర్చోవాలా అని ఆయనొక రూ.5వేలు ఆఫీసు ఖర్చుల కింద నొక్కేశారు. డీఎంహెచ్‌వో ఇచ్చిన ఫైల్‌ను డైరెక్టరేట్‌లో ఆమోదం పొందడానికి రూ.10వేలు ఖర్చవుతుందని డీపీఎంవోయే మరో రూ. 10వేలు వసూలు చేశారు. అయితే వీరిని రిలీవ్‌చేయడానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డంకిగా ఉందని, కలెక్టరేట్‌లో రూ.5వేలు ఇస్తే గాని రిలీవ్ ఆర్డర్స్ ఇవ్వరని మరో రూ.5వేలు అడ్డంగా నొక్కేశారు. వాస్తవానికి రిలీవ్ ఆర్డర్స్ కలెక్టర్ ఇవ్వక్కర్లేదు. రొటీన్‌గా కలెక్టర్‌కు ఫైల్ పెట్టినా దీనికి ఎమ్మెల్సీ కోడ్ వర్తించదు. ఈ విషయాలు తెలిసే వైద్యాధికారుల నుంచి సొమ్ములు నొక్కేశారు. వైద్యాధికారులుగా ఉంటూ పీజీ సీటు సంపాదించుకున్నవారికి ప్రభుత్వం ఉచితంగానే చదివిస్తుంది. అదే ప్రైవేటు మెడికల్ కళాశాలలో చదివితే కోట్ల రూపాయలు ఫీజులు కట్టాలి. అంత సొమ్ము మిగులుతున్నందున రూ.30వేలు ఒక లెక్కా అన్న కోణంలో డీపీఎంవో సొమ్ములు కలెక్ట్ చేసేశారు. ఇలా ఆయన వేసిన ప్రతీ స్కెచ్ కాసులు కురిపిస్తుండటంతో డీఎంహెచ్‌వో కూడా డీపీఎంవో ఐడియా తన జీవితాన్ని మార్చేస్తుందన్న ఆశతో ఆయన్ను విపరీతంగా ఎంటర్‌టైన్ చేస్తున్నారు.

### ఇమ్యూనైజేషన్ వేహికల్‌కు సొంత బిల్లులు

జిల్లాలో ఇమ్యూనైజేషన్ టీకాలు పీహెచ్‌సీలకు సరఫరా చేసేందుకు ఒక వాహనం ఉంది. ఇది ఈమధ్య రిపేరైందంటూ రూ.లక్షకు బిల్లు పెట్టి ఎంచక్కా తినేశారు. వాస్తవానికి ఈ వాహనం మరో ప్రాజెక్ట్ ఆఫీసర్ జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ పరిధిలోకి వస్తుంది. అయితే గియితే ఆయన ఈ వాహనం రిపేరు చేయించాలని, లేదా చేయించుకున్నానని బిల్లులు పెట్టాలి. అలా కాకుండా డీఎంహెచ్‌వో అండదండలతో డీపీఎంవోనే ఇందుకు సంబంధించిన బిల్లులు పెట్టేసి సర్దేశారని భోగట్టా. కోవిడ్-19లో అత్యవసర సేవల కోసం 72 మంది ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలను ఔట్‌సోర్సింగ్‌తో పాటు అనేక పద్ధతుల్లో నియమించారు. కోవిడ్ సీజన్ ముగిసిన తర్వాత వీరిని దశలవారీగా తొలగించారు. అయితే ఇప్పుడు ఇందులో ఎనిమిది మందికి మళ్లీ ఏదో ఒక సాకు చూపించి పోస్టింగ్‌లు ఇస్తానంటూ డీపీఎంవో వసూళ్లు మొదలుపెట్టినట్టు ఆరోపణలున్నాయి. అలాగే డీఎంహెచ్‌వో కార్యాలయంలో సొమ్ము లొచ్చే గుమస్తా - మిగతా చివరి పేజీలో




• ఎడిటోరియల్

# మడమ తిప్పిన ట్రంప్

జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే డోనాల్డ్ ట్రంప్ మాటలు మారుతున్నాయి, అలాంటి వారు మడమతిప్పటమే తరువాయి. సహజంగానే వ్యాపారి అయిన ఆ పెద్దమనిషి తనదైన శైలిలో అందరితో బేరసారాలాడుతున్నారు, బిస్కెట్లు వేస్తున్నారు. ఏది లాభసాటిగా ఉంటే దాన్నే అనుసరిస్తారు. అధికారాన్ని చేపట్టిన నెల రోజుల తర్వాత బుధవారం తొలిసారిగా ట్రంప్ మంత్రివర్గ తొలి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఖనిజాల మీద ఒప్పందం కుదుర్చుకున్నప్పటికీ ఉక్రెయిన్ భద్రత గురించి సాధారణం కంటే ఎక్కువగా ఎలాంటి హామీలు ఇవ్వటం లేదని ట్రంప్ చెప్పాడు. అంతేకాదు, శాంతి ఒప్పందం కుదరాలంటే పుతిన్ కొన్ని రాయితీలకు అంగీకరించాల్సి ఉంటుందని కూడా చెప్పారు. ఒకవైపు స్తంభింపచేసిన నిధులపై ఆంక్షలను ఎత్తివేస్తూ ఆయుధాలు కొనుగోలు చేసేందుకు తైవాన్‌కు అవకాశం కల్పించిన ట్రంప్ దాని రక్షణ గురించి అడగ్గా వ్యాఖ్యానించేందుకు నిరాకరించటమే కాదు, చైనా పెట్టుబడులను అమెరికాకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఇది అమెరికా వైఖరికి భిన్నంగా ఉంది. అందించిన మిలిటరీ, ఆర్థిక సాయాన్ని తీర్చే స్థితిలో ఉక్రెయిన్ లేనందున అక్కడ ఉన్న 500 బిలియన్ డాలర్ల విలువ గల విలువైన ఖనిజాలు, సహజ సంపదలున్న ప్రాంతాలను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసినట్లు వార్తలు వచ్చాయి. తీరా ఇప్పుడు వాటిని వెలికి తీసేందుకు రెండు దేశాలు కలసి ఒక సంస్థను ఏర్పాటు చేసి, తద్వారా వచ్చే రాబడిలో సగాన్ని దాని ద్వారా ఉక్రెయిన్ రక్షణ, పునర్‌నిర్మాణానికి ఖర్చు చేయాలని అంగీకరించినట్లు చెబుతున్నారు. అమెరికా ఇచ్చిన సాయానికి అది ఖనిజాలను స్వాధీనం చేసుకుంటే తామిచ్చినదాని సంగతేమిటనే ప్రశ్న నాటోలోని ఐరోపా ధనిక దేశాల నుంచి రావటం అనివార్యం. అందువలన ఉమ్మడి సంస్థ పేరుతో అమెరికా పెత్తనంలోకి వెళ్లేట్లుగా చూస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఒకటి స్పష్టమైంది. గత మూడు సంవత్సరాలుగా ఉక్రెయిన్ ప్రతిఘటనలో రష్యాకు తగిలిన ఎదురుదెబ్బలు, ఓటమి అంటూ పశ్చిమదేశాలు, వాటి కనుసన్నలలో నడిచే మీడియా వండివార్చిన కట్టుకథలు, కృత్రిమ వీడియోలు వాస్తవం కాదని, ఉక్రెయిన్ ఓడిపోవటం తప్ప మరొకటి జరగదని తేలిపోయింది. నైవేద్యంగా పెట్టిన వాటిని దేవుడు తినడని పూజారికి తెలిసినంతగా భక్తులకు తెలియదు. అలాగే ప్రతిదాన్ని డాలర్ల లాభాలతో కొలిచే ట్రంప్‌కు ఉక్రెయిన్ మీద పెట్టే ప్రతి డాలరునూ రాబట్టుకోవటం కష్టమని, అందువల్లనే ఖనిజాల ఒప్పందం అని కూడా చెబుతున్నారు. విజయం సాధించినట్లు పుతిన్ చెప్పుకోవచ్చు గానీ అది ఉక్రెయిన్‌లో గెలిచో మరొక దానితోనో కాదని ట్రంప్ యంత్రాంగ చర్యలతో అనే కొత్త పల్లవిని పశ్చిమ దేశాల విశ్లేషకులు ఎత్తుకున్నారు. శుక్రవారం జెలెన్స్కీ వాషింగ్టన్ వెళతాడని, ఒప్పందం మీద సంతకాలు చేస్తాడని వచ్చిన వార్తలు కార్యరూపం దాలిస్తే ఒప్పంద అంశాలు వెల్లడైన తర్వాత మాత్రమే ఒక స్పష్టత వస్తుంది. ఒకవైపు చైనా మీద ఇక యుద్ధమే శరణ్యం అన్నట్లుగా సుంకాలు విధించేందుకు పూనుకున్నట్లు చెబుతున్న ట్రంప్ బుధవారం చైనాలో అంతర్భాగం – తిరుగుబాటు రాష్ట్రంగా ఉన్న తైవాన్ రక్షణ గురించి వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు. చైనా నేతతో తనకు మంచి సంబంధం ఉందని, చైనా పెట్టుబడులను కోరుతున్నట్లు చెప్పాడు. నిజానికి ఇది చైనాకు బిస్కెట్ వేయటం తప్ప మరొకటి కాదు. తైవాన్‌కు 87 కోట్ల డాలర్ల మిలిటరీ సాయంతో సహా 530 కోట్ల డాలర్లను ఇచ్చేందుకు గతంలో నిర్ణయించిన అమెరికా ఆ నిర్ణయాన్ని స్తంభింపచేసింది. తాజాగా నిధుల విడుదలకు నిర్ణయించింది. అలాంటపుడు బలవంతంగా తైవాన్ స్వాధీనానికి చైనాను అనుమతిస్తారా అన్న ప్రశ్నకు మాట్లాడేందుకు నిరాకరించినంత మాత్రాన వైఖరిని మార్చుకున్నట్లు కాదు. ఉక్రెయిన్ మీద ట్రంప్ మాటలను చూస్తుంటే తైవాన్‌ను కూడా వదిలించుకుంటారా అన్నది జనాభిప్రాయంగా ఉందని, ఇలా అయితే అమెరికా వాగ్దానాలను ఎవరూ నమ్మరని న్యూయార్క్ టైమ్స్ పత్రిక వాపోయింది. ఖనిజాల ఒప్పందంతో ట్రంప్‌ను సంతుష్టీకరించేందుకు ఉక్రెయిన్ ఎలా చూస్తున్నదో తైవాన్ కూడా అమెరికా నుంచి ఏడు నుంచి పది బిలియన్ డాలర్ల విలువ గల ఆయుధాలను కొనుగోలు చేస్తామని లీకులు వదిలింది. కొద్ది రోజులుగా ట్రంప్ చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలకు తేడా ఉంది. అందుకే అవి ఏ విధంగా మారతాయి, ఎలాంటి పర్యవసానాలకు దారితీస్తాయన్నది ఊహించటం కష్టం.

# పశు వైద్య విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- పశు వైద్య విద్యార్థులకు స్టైఫండ్ 7000 నుంచి 25000 వేలుకు పెంచాలి
- వెటర్నరీ విద్యార్థుల స్టైఫండ్ మీద రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి

వెటర్నరీ యూనివర్సిటీ, విద్యార్థులకు ఇతర వైద్య కోర్సుల విద్యార్థులతో సమానంగా (బి.వి.ఎస్ సి, ఏ.హెచ్, ఎం.వి.ఎస్.సి, పి.హెచ్.డి) విద్యార్థులకు స్టయిఫండ్ పెంచాలని ఏపీ రైతు సంఘం, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో ఇన్చార్జ్ ఏవో ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, ఏపీ రైతుసంఘం జిల్లా కన్వీనర్ చాపర వేణులు మాట్లాడుతూ తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు, గరివిడి, తిరుపతి డైరీ టెక్నాలజీ విద్యార్థులు ఈనెల మూడవ తేదీ నుండి తమకు ప్రభుత్వం ఇచ్చే స్టయిఫండ్ పెంచాలని దాదాపు 25రోజులు క్లాసులను బహిష్కరించి శాంతియుత ఆందోళన చేస్తున్నా కనీసం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని వాపోయారు. 2013 నుండి వెటర్నరీ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే స్టయిఫండ్ కేవలం రూ.7వేలు, పీజీ విద్యార్థులకు నెలకు రూ.9వేలు, పీహెచ్‌డీ విద్యార్థులకు రూ.10వేలు ఇస్తున్నారు. మెడికల్ విద్యార్థులకు నెలకు రూ.25 వేలకు పైగా చెల్లిస్తున్నారు. పశువైద్య విద్యార్థులకు, వైద్యరంగంలోని విద్యార్థులకు స్టయిఫండ్‌లో అత్యధిక వ్యత్యాసం చూపడం సరికాదని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. పశు వైద్య విద్యార్థులు ఇంటర్నెట్‌షిప్ ప్రోగ్రాం చేయవలసి ఉంటుందని స్టాటిక్ ఫేస్, రాష్ట్రంలో వెటర్నరీ పాలీక్లినిక్‌లకు వివిధ డైరీ ఫామ్‌లకు, యానిమల్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లకు, పశు శిక్షణకేంద్రాలకు వెళ్లాల్సి ఉంటుందని, ఆ సమయంలో వారు తామే సొంతంగా ఆహారం, వసతి ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రయాణ ఖర్చులు కూడా భరించాల్సి ఉంటుందన్నారు. ఇదంతా అధిక వ్యయప్రయాసలతో కూడుకున్నదన్నారు. ప్రభుత్వం ఇచ్చే స్టయిఫండ్ రూ.7వేలు ఎటూ సరిపోవని విద్యార్థులు ఆందోళన చెందుతున్న వారి భవిష్యత్తును ఈ ప్రభుత్వం గాలికి వదిలేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు సమస్యను గత ప్రభుత్వ హయాంలో కూడా 2022 మార్చి నుండి 26వ తేదీ వరకు విద్యార్థులు క్లాసులు బహిష్కరించి ఆనాటి ప్రభుత్వం దృష్టికి తెచ్చారన్నారు. అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని స్వయంగా గన్నవరం పశు వైద్య కళాశాలలకు వచ్చి, హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని అప్పటి ప్రభుత్వం గాలికి వదిలేందని విమర్శించారు. ప్రస్తుతం పశువైద్య విద్యార్థులు సమస్యలను తిరిగి కూటమి ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇంత తక్కువ స్టయిఫండ్ లేదు. రూ.14వేల నుండి రూ.24వేలు వివిధ రాష్ట్రాల్లో ఇస్తున్నారు. 2013లో విద్యార్థులు చెల్లించే ఫీజు రూ.10,900రూపాయలు ఉంటే, 2025లో రూ.47,500 పెరిగింది. కానీ ప్రభుత్వం బి.వి.ఎస్‌సి, విద్యార్థులకు స్టయిఫండ్ ఇప్పటికీ రూ.7వేలు మాత్రమే ఉందన్నారు. ప్రతి సంవత్సరం పెరుగుతున్న ఖర్చుల ప్రకారం 10శాతం అంటే నెలకు 700 పెరగాల్సి ఉందన్నారు. అదేవిధంగా పెరుగుతున్న ఇన్‌ఫ్లేషన్ 7% ప్రకారంగా చూసినా కనీసంగా నెలకు రూ.500 లుగా పెరగాలన్నారు. కానీ గత 13 సంవత్సరాలు స్టయిఫండ్ పెంచకుండా ఉండటం ఏమాత్రం న్యాయబద్ధం కాదని హెచ్చరించారు. వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారు సైతం విద్యార్థుల స్టేట్ అండ్ పెంచాలని కూటమి ప్రభుత్వానికి సిఫారసు చేశారు. కావున వెంటనే ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పశువైద్య విద్యార్థులకు న్యాయమైన కోరికలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్దఎత్తున పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రవి పాల్గొన్నారు.

'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

# ఎన్‌సీఎస్‌లో సైన్స్ దినోత్సవం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని స్థానిక పిఎన్ కాలనీలో గల న్యూ సెంట్రల్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రఖ్యాత శాస్త్రవేత్త, నోబుల్ అవార్డు గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పాఠశాల ప్రధానాచార్యులు బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్లు శ్రీకాంత్ శ్రీదేవి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎర్రంనాయుడు మాట్లాడుతూ సీవీ రామన్ గొప్పతనాన్ని, సైన్స్‌డే ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా సైన్స్ ప్రతిజ్ఞను విద్యార్థులందరితో చేయించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్లు వైవిఎస్ఎన్ మూర్తి, వి సరోజిని, సైన్స్ ఉపాధ్యాయులు సంతోష్, సుధాకర్, పుష్పలత, మాధురి శైలజ,వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సైన్స్ దినోత్సవం

(సత్యంన్యూస్, టెక్కలి)

మండలంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రాము మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో సైన్స్ ఒక భాగమని ప్రతి వ్యక్తి తను చేసే పనుల్లో సైన్స్ ఇమిడి ఉంటుందన్నారు. అందువలన ప్రతి ఒక్కరి జీవన విధానంలో సైన్స్ అంతర్భాగంగా ఉంటుం దన్న విషయం గ్రహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సైన్సు ఉపాధ్యాయులు కె.అచ్యుతరావు, వెంకటలక్ష్మి, విద్యార్థులు వాతావరణానికి, కాలుష్యానికి, రైన్ హార్వెస్టింగ్, స్వచ్ఛభారత్‌కు సంబంధించి స్థానిక ప్రజలను చైతన్యవంతులుగా చేసే అనేక అనేక ప్రాజెక్టులను తయారుచేసి వాటి నమూనాలను ప్రదర్శించారు అందులో ఉత్తమంగా తయారుచేసిన ప్రాజెక్టులను ఉపాధ్యాయులు ఎంపిక చేసి వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# అన్ని సినిమాలు బలగం కాలేవు..!

వేణు యెల్దండి డైరెక్షన్‌లో వచ్చిన బలగం సినిమా సెన్సేషనల్ హిట్ అందుకుంది. కమెడియన్ గా చేసిన వేణు ఇంత గొప్ప సినిమా ఎలా తీశాడు అనే రేంజ్ లో ఆడియన్స్ అంతా షాక్ అయ్యారు. సినిమా కథ కథనం నటీనటుల ప్రతిభ అన్నీ బలగం సినిమాకు కలిసి వచ్చాయి. అంతేకాదు ఆ సినిమాకు భీమ్స్ ఇచ్చిన మ్యూజిక్ కూడా సినిమాకు బలంగా నిలిచింది. ఊరు పల్లెటూరు సాంగ్ తోనే సినిమాపై ఒక బజ్ ఏర్పడింది. ఐతే బలగం సినిమాను చూసి అలాంటి సినిమాలనే చేయాలని కొందరు ప్రయత్నించారు. ముఖ్యంగా వేణుతో సమకాలీకుడు అయిన కమెడియన్ ధన్‌రాజ్ కూడా మెగాఫోన్ పట్టి సినిమా చేశాడు. రామం రాఘవం అంటూ ఒక ఫాదర్ అండ్ సన్ సినిమా చేశాడు. ఐతే ఆ సినిమా లాస్ట్‌వీక్ రిలీజ్ కాగా అంత ఇంపాక్ట్ క్రియేట్ చేయలేకపోయింది. ఐతే డైరెక్టర్‌గా వేణు సక్సెస్ అయ్యాడు కాబట్టి ధన్ రాజ్ సినిమా చేయలేదు. తనలో ఉన్న కథకుడిని ప్రేక్షకుడికి పరిచయం చేయాలని రామం రాఘవం చేశాడు.

సినిమా ఫలితం ఏంటన్నది పక్కన పెడితే డైరెక్టర్ ధన్‌రాజ్ పాస్ మార్కులు తెచ్చుకున్నాడనే చెప్పొచ్చు. ఇక బలగం తరహాలోనే ఈమధ్యనే బాపు అనే సినిమా ఒకటి రిలీజైంది. ఈ సినిమా కూడా బలగం ఫార్మెట్‌లోనే వచ్చింది. ఎమోషనల్ డ్రామాగా వచ్చిన ఈ సినిమా ప్రేక్షకులకు కనెక్ట్ కాలేకపోయింది. ఐతే ఈ సినిమాలో బ్రహ్మాజి నటించడం వల్ల అందరికీ తెలిసింది కానీ సినిమా మాత్రం ఆడియన్స్ కు పెద్దగా ఎక్కలేదు. సో బలగం వచ్చింది కదా అని రామం రాఘవం, బాపు సినిమాలను చూసేయరు. ఒక సినిమా హిట్ అయ్యింది అంటే ఆ సినిమాకు అలా కుదురుతుంది మళ్లీ అలా సెట్ అవ్వాలి అంటే కష్టమే. ఐతే తెలుగు ఆడియన్స్ కూడా మంచి సినిమాలను ఆదరిస్తున్నారు కానీ ఒకటే ఫార్మెట్ లో రెండు మూడు సినిమాలు వస్తే మాత్రం ఆడియన్స్ ఆదరించే అవకాశం లేదు. ఐతే కథ కథనాలు నటీనటుల ప్రతిభ దర్శకుడి ఎఫర్ట్ గుర్తిస్తే మాత్రం ప్రేక్షకులు ఆ సినిమాను ఎంకరేజ్ చేసే ఛాన్స్ ఉంటుంది.







# రిలీజ్ డేట్ లాక్ చేశారు

**ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న, డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్-ఇండియన్ మూవీ 'కుబేర'. ఈ చిత్ర రిలీజ్ డేట్‌ను మేకర్స్ లాక్ చేశారు. జూన్ 20న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది.**

'ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న, జిమ్ సర్భ్‌లతో కూడిన అద్భుతమైన తారాగణంతో 'కుబేర' భారతీయ సినిమాలో గేమ్-ఛేంజర్‌గా నిలుస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు.'క్యారెక్టర్ బేస్డ్ నెరేటివ్స్‌తో అదరగొట్టే శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని నెవర్ బిఫోర్‌గా తీర్చిదిద్దారు. ఇది ఈ సంవత్సరంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. రిలీజ్ డేట్ పోస్టర్ నాగార్జున, ధనుష్‌లను ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్స్‌తో అద్భుతంగా ప్రజెంట్ చేసింది. జిమ్ సర్భ్ బ్యాక్‌డ్రాప్‌లో నిలబడి ఉండడం ఆసక్తికరంగా ఉంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేసిన ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ అద్భుతమైన స్పందనతో అంచనాలను పెంచింది. ముఖ్యంగా ఇందులో ధనుష్, నాగార్జున, రష్మిక, జిమ్ సర్భ్‌ల పాత్రలు చాలా వైవిధ్యంగా ఉంటాయి. అంతేకాదు ఈపాత్రల తీరుతెన్నులు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి. ఇన్నేండ్ల కెరీర్‌లో అటు ధనుష్, ఇటు నాగార్జున ఈ తరహా పాత్రల్ని పోషించలేదు. దీంతో ఈ సినిమా కోసం ఈ ఇద్దరు హీరోల అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. 'పుష్ప'సిరీస్, 'ఛావా' చిత్రాలతో దేశవ్యాప్తంగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక రష్మిక పాత్ర అందర్నీ మెస్మరైజ్ చేస్తుంది. సినిమాలో ఎంతో కీలకంగా ఉన్న ఈమె పాత్రను దర్శకుడు శేఖర్ కమ్ముల తెరకెక్కించిన విధానం సూపర్బ్‌గా ఉంటుంది. ఈ సినిమాతో ఆమె మరో స్థాయికి వెళ్తుందనే నమ్మకం ఉంది. తన సినిమాల్లో భావోద్వేగాలకు పెద్ద పీట వేసే దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమాలోనూ తనదైన మార్క్ ఎమోషన్స్‌ని పండించబోతున్నారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసీ ఎల్ఎల్‌పి పతాకంపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో విడుదల కానుంది.



# కవ్వించే చూపులతో ముద్దుగుమ్మ

'మనసుకు నచ్చింది' సినిమాతో అమైరా దస్తూర్ తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయింది. ఆ సినిమా నిరాశ పరచడంతో తెలుగులో పెద్దగా ఆఫర్లు రాలేదు. రాజ్ తరుణ్ తో కలిసి రాజుగాడు సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన అమైరాకి ఆ సినిమా నిరాశను మిగిల్చింది. రాజుగాడు సినిమా తర్వాత తెలుగులో ఈ అమ్మడు పెద్దగా కనిపించలేదు. కానీ హిందీ, తమిళ్ సినిమాల్లో ఈమెకు అడపా దడపా ఆఫర్లు వస్తున్నాయి. హిందీలో ఈ అమ్మడు ప్రస్థానం, జడ్జిమెంటల్ హై క్యా, కోయి జానే నా, జోగి, ఇన్ఫ్లుయెన్సర్ లైఫ్ సినిమాల్లో నటించింది. అవేవి ఈ అమ్మడికి స్టార్‌డంను తెచ్చి పెట్టలేకపోయాయి. గత సంవత్సరం ఫుర్సీలా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆడకపోవడంతో మళ్లీ ఆఫర్ల కోసం ఈ అమ్మడు ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి. ఆ తర్వాత హీరోయిన్‌గా మాత్రమే సినిమాను చేయాలని ఈ అమ్మడు ఆశ పడింది. కానీ హీరోయిన్‌గా ఈ అమ్మడికి ఆఫర్లు దక్కడం లేదు. కానీ సోషల్ మీడియా ద్వారా ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో స్టార్ హీరోయిన్స్ రేంజ్‌లో అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసే అమైరా దస్తూర్ కి దాదాపుగా 3.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్నారు. వెండి తెరపై అందాల ఆరబోత చేసే అవకాశం దక్కక పోయినా ఇలా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన అందాల ఆరబోత ఫోటోలను అమైరా దస్తూర్ రెగ్యులర్‌గా షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు ఈ ఫోటోలతో కన్నుల విందు చేసింది. కవ్వించే విధంగా చూస్తూ ముద్దుగుమ్మ చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఈ స్థాయి అందం ఉన్నా సినిమాల్లో అమైరాకి రావాల్సిన ఆఫర్లు రాలేదు, దక్కాల్సిన గుర్తింపు దక్కలేదు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గతంలో స్పెషల్ సాంగ్‌లో నటించిన అమైరా దస్తూర్ మరోసారి అలాంటి ప్రత్యేక పాటలకు, ప్రత్యేక పాత్రలకు ఓకే చెబుతోంది. ఆకట్టుకునే అందం, మంచి ఫిజిక్ ఉండటంతో పాటు నటిగా మంచి ప్రతిభ ఉన్న అమైరా దస్తూర్ ముందు ముందు అయినా సినిమాల్లో మంచి ఆఫర్లు దక్కించుకుంటుందేమో చూడాలి. హీరోయిన్‌గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగానూ అమైరా దస్తూర్ నటించేందుకు ఓకే చెబుతుంది. కనుక బాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడు ముందు ముందు బిజీ అయ్యేనా చూడాలి.









# బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం విస్మరించారు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్ర బడ్జెట్లో జర్నలిస్టుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన సంప్రదాయం కూటమి ప్రభుత్వం కూడా కొనసాగించిందని చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంఘం (స్మాల్) రాష్ట్ర అధ్యక్షులు నల్లి ధర్మారావు ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కేంద్ర బడ్జెట్‌లోనే కాకుండా, అన్ని రాష్ట్రాల బడ్జెట్ల లోనూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్న ఆలోచన ఏ ప్రభుత్వానికి రాలేదని గుర్తుచేశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సీనియర్ జర్నలిస్టులకు పింఛన్లు మంజూరు చేశాయని, జర్నలిస్టుల సంక్షేమ నిధికి, ప్రమాద బీమాకు, ఇళ్ల స్థలాలు, గృహనిర్మాణానికి ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నాయని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో బస్సు ప్రయాణ రాయితీ, ఆరోగ్యశ్రీ, సంక్షేమ నిధి వంటి పథకాలకు ముఖ్య మంత్రిగా చంద్రబాబు మాత్రమే చొరవ తీసుకు న్నారని, జిల్లా కేంద్రాలలో ప్రెస్‌క్లబ్‌ల నిర్మాణా లకు నిధులు మంజూరు చేశారని, మండల స్థాయి జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వాలన్న నిర్ణయం తీసుకున్నారని ధర్మారావు గుర్తు చేశారు. కానీ, ఇళ్ల స్థలాలు, ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా ఎటువంటి జీవోలు ఇవ్వకుండా, దరిద్రరేఖ దిగువన ఉన్నవారిగానే గుర్తించి, స్థానిక ప్రజాప్రతినిధుల ఉదారతతో జర్నలిస్టులకు కూడా మంజూరు చేశారని తెలిపారు. జగన్ ప్రభుత్వానికి ముందు ఇటువంటి ప్రత్యేక జీవోల కోసం ఏపీయూడబ్ల్యూజే ఒక ఉద్యమం చేసిందని, ఆ విషయం ముఖ్యమంత్రికే కాకుండా ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కూడా తెలుసునని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమ పట్ల ఏ రాజకీయ పార్టీ ప్రత్యేకంగా ఏ ఎన్నికల్లోనూ ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. అక్రిడిటేషన్ల పాలసీని ప్రకటించకుండా, పాత వాటిని పొడిగించడంలోనే ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుందని అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటి మీడియా ప్రతినిధుల కోసం ఈ బడ్జెట్‌లో కూడా ఏమాత్రం కేటాయింపులు లేకపోవడం జర్నలిస్టు సమాజాన్ని ఆవేదనకు గురిచేస్తోందని, బడ్జెట్ ఆమోదం జరిగిన తర్వాత కూడా తగిన నిర్ణయాలు తీసుకోవడానికి ప్రభుత్వానికి అధికారం ఉందని, కొద్ది రోజుల తర్వాతైనా తగిన నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని ధర్మారావు కోరారు.




# నిరుద్యోగ భృతికి కేటాయింపులేవీ?

## - వైకాపా ఉత్తరాంధ్ర యువజన అధ్యక్షుడు స్వరూప్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కూడా ఎన్నికల హామీల్లో భాగమైన నిరుద్యోగ భృతి ఇవ్వడానికి సిద్ధంగా లేదని అర్థమైందని, దీనిపై త్వరలోనే వైకాపా యువజన విభాగం నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని వైకాపా ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు మెంటాడ స్వరూప్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ వరకు అమలుచేయాల్సిన వివిధ పథకాలకు బడ్జెట్ రూపంలో అంకెలను ప్రవేశపెట్టారని, అందులో ఎక్కడా నిరుద్యోగ భృతికి రూపాయి కూడా కేటాయించలేదని ఆయన అన్నారు. 2014–19లో కూడా చంద్రబాబు నాయుడు జాబు రావాలంటే బాబు రావాలని, జాబు ఇవ్వలేకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత ఐదేళ్లలో ఆ ఊసే లేదన్నారు. ఈసారి కూడా నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని ప్రభుత్వం బడ్జెట్ ద్వారా ప్రకటించినట్లయిందన్నారు. నారా లోకేష్ ప్రకటించిన లక్షల ఉద్యోగాల కల్పనకు బడ్జెట్‌లో ఎలా కేటాయింపులు జరిపారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

# రాజకీయం పులి మీద స్వారీ

(మొదటిపేజీ తరువాయి)

ఓ సినిమా ఫ్లాప్‌కు పరోక్షంగా కారణమయ్యాడు. సినిమా రంగం డబ్బుతో, గ్లామర్‌తో ముడిపడిన ప్రపంచం. పెద్ద వ్యాపారం. కళ్లు, కాళ్లూ నేలమీద ఉండాలి. ఏమాత్రం అదుపుతప్పినా భవిష్యత్తు గల్లంతవుతుంది. వర్తమానం టెన్షన్ పెడుతుంది. విధానాల మీద విమర్శలు చేస్తే తర్వాత వారిని ఎవరైనా యాక్సెప్ట్ చేస్తారు. చంద్రబాబును గతంలో విమర్శించినవారు కూడా ఈరోజు ఆయనతో ఉన్నారు. వారు విమర్శల్లో ఎక్కడా హద్దులు దాటలేదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుటుంబాలను విమర్శించిన కృష్ణమురళీ ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. జరగబోయే ముప్పును పోసాని ముందుగానే గుర్తించారు. అందుకే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు. కాసేపు చంద్రబాబును పొగిడారు కూడా. కానీ అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. రాజకీయం పులిమీద స్వారీ లాంటిది. ఎప్పుడూ స్వారీ చేస్తునే ఉండాలి. సడెన్‌గా దిగిపోయి నువ్వూ నేను ఫ్రెండ్స్ అంటే పులి అంగీకరించదు. అమాంతం మింగేసి అస్తిపంజరాన్ని బయటకు ఊసేస్తుంది. కృష్ణమురళీ మళ్లీ పులిమీద స్వారీ చేస్తారా? అస్త్రసన్యాసం చేస్తారా? అన్నది కాలమే చెప్పాలి. తెలుగుదేశం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన నేతలే ఎక్కువగా వ్యక్తిగత విమర్శలు చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే వీరి జోలికి వెళ్లరని అంతా భావించారు. కానీ లోకేష్ రెడ్‌బుక్‌లో కులాలు లేనట్టే ఉన్నాయి. వల్లభనేని వంశీని ఇప్పటికే లోపలేశారు. ఇప్పుడు పోసాని కృష్ణమురళీని ఆ పక్కనే చేర్చారు. భవిష్యత్తులో కొడాలి నాని. ఆ తర్వాత శ్రీరెడ్డి, రామ్‌గోపాల్ వర్మ. ఇలా ఏ ఒక్క అవకాశాన్ని అధికార పార్టీ వదులుకోదు. మంచిదే. ఇప్పటికైనా విమర్శల్లో కొంతైనా సంస్కారాన్ని ఆశించొచ్చు. కాకపోతే ఆ పని టీడీపీ నేతలు చేసినా ఇలాగే వ్యవహరిస్తే కొన్నాళ్లకు హుందా రాజకీయాలు మాట్లాడే నాయకులు మాత్రమే మైకుముందుకొస్తారు.

# 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం



**అమరావతి:** దేశం, రాష్ట్రం అభివృద్ధికి దోహదపడేది వ్యవసాయ రంగం అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో భాగంగా వ్యవసాయ బడ్జెట్‌ను ఆయన శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రైతులకు మనసారా నమస్కరిస్తూ వ్యవసాయ బడ్జెట్‌ను సభ ముందుంచారు. ప్రధాన వనరైన వ్యవసాయాన్ని ప్రాథమిక రంగంగా గుర్తించామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రైతులను స్థితిమంతులుగా చూడాలని ఆకాంక్షిస్తూ స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ 2047కు అనుసంధానంగా ఏపీని ప్రగతిపథంలో ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వెల్లడించారు.

**వ్యవసాయ రంగానికి పెద్దపీట**

రాష్ట్ర శాసనసభలో వ్యవసాయ బడ్జెట్‌ను వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రవేశపెట్టారు. రూ.48,341.14 కోట్ల అంచనాలతో రూపొందించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో మంత్రి చదివి వినిపించారు. అంతకుముందు రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో కూడా వ్యవసాయ బడ్జెట్ సభ్యులు ఆమోదించారు. ప్రాధాన్యత అంశాలు పరిశీలిస్తే.. విత్తన రాయితీ పంపిణీకి రూ.240 కోట్లు, ఎరువుల బఫర్ స్టాక్ నిర్వహణకు రూ.40 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.61.78 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.219.65 కోట్లు, రైతులకు వడ్డీలేని రుణాల కింద రూ.250 కోట్లు, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం అమలుకు రూ.9,400 కోట్లు కేటాయించారు. అలాగే ఉచిత పంటల బీమా కోసం రూ.1,023 కోట్లు, వ్యవసాయ శాఖకు రూ.12,401.58 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.930.88 కోట్లు, పట్టుపరిశ్రమకు రూ.96.22 కోట్లు, సహకార శాఖకు రూ.239.85 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,112.07 కోట్లు, మత్స్య రంగానికి రూ.540.19 కోట్లు, ఎన్జీ రంగా వర్సిటీకి రూ.507.01 కోట్లు, వైఎస్సార్ వర్సిటీకి రూ.98.21 కోట్లు, ఎస్వీ వెటర్నరీ వర్సిటీకి రూ.154.57 కోట్లు, ఏపీ ఫిషరీస్ వర్సిటీకి రూ.38 కోట్లు, ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకానికి రూ.12,773.25 కోట్లు, ఉపాధి హామీకి రూ.6,026.87 కోట్లు, ఎన్టీఆర్ జలసిరికి రూ.50 కోట్లు, నీటివనరుల శాఖకు రూ.12,903.41 కోట్లు కేటాయించారు.

# సాంఘిక సంక్షేమ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)



పెద్దపాడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశానికి అర్హులైన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.రంగమణి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు మార్చి 6 వరకు (https://apbragcet.apcfss.in) ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. బాలికలకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలిపారు. 5వ తరగతి వారికి ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, అలాగే ఇంటర్మీడియట్ వారికి అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

**ప్రవేశానికి అర్హత:** 5వ తరగతి ఎస్.సి/ఎస్.టి విద్యార్థులు 1-9-2012 నుంచి 31-8-2016 మధ్య జన్మించినవారై ఉండాలి. ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బీసీ-సి) విద్యార్థులు తేది 1-9-2014 నుంచి 31-8-2016 మధ్య జన్మించినవారై ఉండాలి. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం 31-8-2025 నాటికి 17 సంవత్సరాలు మించకూడదు. ఈ ఏడాదిలో టెన్త్ పబ్లిక్ పరీక్షకు (మార్చి–2025) హాజరవుతున్నవారు మాత్రమే అర్హులు.

**ఆదాయ పరిమితి:** అభ్యర్థి తల్లి, తండ్రి/సంగక్షకుల ఆదాయం రూ.లక్ష మించి ఉండకూడదు. గ్రామ సచివాలయం/ తహశీల్దార్ ద్వారా ధ్రువీకరించబడాలి.

ఎస్సీలకు 75 శాతం, బీసీ–సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ 12 శాతం, ఎస్టీ 6 శాతం, బీసీ 5 శాతం, ఇతరులకు 2 శాతం సీట్లు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ రంగమణి తెలిపారు. వివరాలకు 97045 50007 సంప్రదించాలన్నారు.

**దరఖాస్తు విధానం :**

ఆసక్తి గల విద్యార్థులు https://apbrageet.apcfss.in ద్వారా దరఖాస్తు ఆన్‌లైన్‌లో సమర్పించాలి. విద్యార్థులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రం, లేదా ఇంటర్నెట్ సెంటర్ ద్వారా దరఖాస్తులను సమర్పించవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి ఎటువంటి రుసుము చెల్లించవలసిన అవసరం లేదు. విద్యార్థులు 5వ తరగతి లేదా జూనియర్ ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఎంచుకున్న పాఠశాల/కళాశాల వివరాలను ఆన్‌లైన్ దరఖాస్తులో తప్పనిసరిగా అందించాలి.

జూనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకున్న, ఐఐటీ–నీట్ కోచింగ్ సెంటర్లో చేరడానికి ఇష్టపడే విద్యార్థులు సెంటర్, గ్రూప్‌ను ఎంచుకోవాలి. ఒకసారి విద్యార్థి ఆన్‌లైన్లో దరఖాస్తు చేసిన తర్వాత ఎటువంటి మార్పులు చేయడానికి వీలు పడదు. 2025–26 విద్యా సంవత్సరానికి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న బాలికలకు పరీక్ష నిర్వహించి అందులో మెరిట్ ఆధారంగా వారికి సీట్లు కేటాయిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

## డీపీఎంవో ఆదేశిస్తారు..

# డీఎంహెచ్‌వో పాటిస్తారు

(మొదటిపేజీ తరువాయి)

సీట్లు, ఖాళీగా ఉండే గుమస్తా ఉద్యోగాలు ఉన్నాయి. ఇందులో నాన్ ఫోకల్‌గా ఉన్న గుమస్తాలను ఫోకల్ సీట్లలోకి తెచ్చి నాలుగు రాళ్లు సంపాదించుకునే విధంగా చేస్తానని, అందుకోసం ఒక్కొక్కరు రూ.25వేలు ఇవ్వాలంటూ డీపీఎంవో బేరం కుదుర్చుకున్నట్టు తెలుస్తుంది. ఈమేరకు డీఎంహెచ్‌వోతో మాట్లాడి సీట్ల మార్పు కోసం రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. ఇటీవల రథసప్తమి వేడుకలకు వైద్యఆరోగ్య సిబ్బందిలో కొందరికి డ్యూటీలు వేశారు. ఇందుకోసం టెంట్లు, కుర్చీలు, భోజనాలకు ఖర్చు అయిందంటూ రూ.2.50 లక్షలకు బిల్లు పెట్టారు. ఎవరికి భోజనాలు పెట్టారో ఎవరికీ తెలియదు.

# చంద్రబాబు ప్రజలను మరోసారి దగాచేశారు

(సత్యంన్యూస్, నరసన్నపేట)



భారీగా అప్పుల అంచనాతో బడ్జెట్ ప్రవేశపెట్టిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మళ్లీ అన్ని వర్గాలను దగా చేసిందని వైకాపా జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సూపర్ సిక్స్ హామీలకు మంగళం పాడే విధం ఈసారి బడ్జెట్ రూపొందించారని, పైగా కిందటిసారి లాగే సంక్షేమం పేరుతో కోతల నాటకానికి తెర తీసిందని విమర్శించారు. ఎన్నికల హామీలను గాలికి వదిలేసి, కీలక హామీలకు కూడా ప్రభుత్వం ఎగనామం పెట్టిందని ఆరోపించారు. మహిళల మహాశక్తి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణానికి పైసా ఇవ్వని ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం పథకాలకు భారీగా కోత విధించిందన్నారు. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని ఏడాదికి రూ.32 వేల కోట్లు ఎగనామం పెట్టిందని, దీపం పథకానికి భారీగా కోత పెట్టిందని, 1.55 కోట్ల మంది లబ్ధిదారులను 90 లక్షలకు కుదించిందని కృష్ణదాస్ విమర్శించారు. డ్వాక్రా మహిళలకు కూడా బడ్జెట్లో కూటమి ప్రభుత్వం టోకరా వేసిం దని, అన్నదాత సుఖీభవకు కేవలం రూ.6300 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఉచిత బస్సు పథకాన్ని గాలికి వదిలేసిందని కృష్ణదాస్ ఆ ప్రకటనలో విమర్శించారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం




(సత్యంన్యూస్, లావేరు)

జాతీయసైన్స్ దినోత్సవం శుక్రవారం జగంపేట భాష్యం స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రకరకాల ప్రాజెక్టులు తయారు చేసి వాటిని ప్రదర్శించి, పనిచేసే విధానం వివరించారు. విద్యార్థులు చేసిన పలు ప్రాజెక్టులు చూపరులను ఆ కట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, చాంప్స్ ప్రిన్సిపాల్ వాణి, గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.